# కటకటాలు

అసలీ పెపంచాన్ని నమ్మకూడదయ్యా ! అదేలే, పెపంచం వంటే మనుసులే. మనిసిని మనిసి నమ్మకూడదయ్యా ! మనిసిని మనిసి నమ్మక మానులు నమ్ముతాయా అనడక్కుమరి. ఓ మనిసిని యింకో మనిసి నమ్మాడూ అంటే అందులో ఏదో తిరకాసుందన్నమాటే. నేను నీతో. నిన్ను నమ్ముతున్నానూ అన్నానంటే అందులో ఏదో ఉందన్న మాటే.... ఏవిటనడుగు ....అవసరమైనప్పుడు ఓ బీడీముక్క పడేత్తావని.... దానిక్కూడా నిన్ను నే నమ్మలేకపోతే ఇంక ఈ కటకటాల్లో మనం బతికేదెట్టా ? ఎవరో ఏమన చెప్పాడు, సుమతి చెప్పాడు అంటారుగానీ అనుభవంతో ఎవరు సెప్పలేరయ్యా ? నే ననుభవించిన జీవితాన్ని బట్టి అళ్ళకి రెండురెట్లు నే సెప్పగల్ను... ఏంటోలే, ఏం సెప్పడానికి మొదలెట్టి ఎక్కడికి పోతన్నానో నాకే అంతుబట్టదు....ఏం టిట్టా వాగుతున్నా వీడు....పొరబాటున పిచ్చాస్పత్రిలో ఎయ్యాల్సినోడిని కిష్ట జన్మస్థానంలో ఎయ్యలేదుగదా అని ఆలోచిస్తన్నావా ? అసలు నిజం సెప్పాలంటే ఈ పెపంచంలో ఎవడికి పిచ్చిలేదు సెప్పు ? పెద్దయినాక ఉద్ధరిస్తాడని ఆశలు పెట్టుకుని కంటికి రెప్పలా నన్ను పెంచి పెద్దజేసిన మా యమ్మకి పిచ్చి కాక మరేటి ?

కాపల్సినోడు గదా నని వరసకి మామ అయ్యే చలపతిని నమ్ముకున్న నాయిన పిచ్చిగాదూ ? తప్పుడుపన్లు సేస్తే జైల్లో ఏత్తారని తెలిసి కూడా తప్పుడుపన్లు చేసి జైల్లో కూకునే ఈళ్ళంతా పిచ్చోళ్ళుగాదూ ? అళ్ళ శరీరాల్ని మాత్రవే బందించి, ఏళకింత బడేసి మేపుతున్న ఈ ఆపీసర్లు పిచ్చోళ్ళుగాదూ ? ఏటో .... సెప్పడం మొదలెడితే యినే సెవి లేకపోయినా సెప్తానే ఉంటాను .... అది సరేకాని గురూ,

ఇంతకీ నువ్వు.... అంటున్నానని అనుకోమాక.... నువ్వు సూస్తే బుద్ధావ తారంలా గున్నావ్.... నిన్ను జైల్లోకి తోసిన పిచ్చోళ్లేవరంట ?"

అంతవరకూ రంగడి మాటలు వింటున్న నారాయణ నవ్వి ఊరుకున్నాడు.

మళ్ళీ అందుకున్నాడు రంగడు. "రేపే నిన్ను విడుదలసేత్తారన్నావ్.... ఇంకా ఆ దిగులెందుగ్గురూ !"

ఔన్లే ! కటకటాల్లో ఉన్నంతకాలం కడుపుకి కూడైనా దొరుకుద్ది. కటకటాలవతల తిండికి కటకటలాడి పోవల్సిందేగా ! మన దేశంలో దరిద్రం సవుద్రంలో నీరులా తరగదుగా ? ఆ, సరేగానీ ! గురో ! నీ గురించి కాస్తంత సెవినెయ్యరాదూ ? యింటాను."

మళ్ళీ చిరునవ్వు తప్ప సమాధానంలేదు నారాయణ దగ్గిర్నించి.

"పోనీ నా కత సెప్తాను యింటావా ?" అడిగాడు రంగడు.

సెప్పమన్నట్టు తలూపాడు నారాయణ.

"నా సిన్నతనం అయ్య సావుని సూసంది. కన్నతల్లి, కావల్సినంత డబ్బు మిగిలాయి. మా అమ్మకి నేనంటే ఎర్రిపేమ .... అస్తమానం అనేది నన్ను "నీకు బొత్తిగా లోకం తెలీదురా రంగా ! ఎట్టా బతుకుతావో ఏమో మరి" అని. నామీదెన్నో ఆశలు బెట్టుకుంది. కానీ ఏంలాబం ? కొన్నాళ్లకి ఆ అమ్మని కూడా కాలం మింగింది. నీకా్కవలసినోడి నంటూ వొచ్చి నన్ను సేరదీశాడు చెలపతి మావ. నా మీద జాలేసిగాదు. నా ఎనకాలున్న డబ్బు జూసి. ఆ సంగతి నాకేంతెల్సు ? మావకో కూతురుంది, సావిత్రి. అదీ, మావా నాతో బానే కబుర్లాడేవారు. అత్తమ్మకి నేనంటే గిట్టేదికాదు, నా ఎనకున్న డబ్బుసూసి బరించేది కాబోలు పాపం. నన్ను సేరదీసింది మొదలు నా సెవిలో మోగుతానే వున్నాడు మావ సావిత్రిని నాకిచ్చి సేస్తానని. నాకూ అదంటే సచ్చే

యిష్టం. దానికీ చెల్పు నా పేమ." మధ్యలో ఆపి కళ్ళు తుడుచుకున్నాడు రంగడు.

"ఏడ స్తన్నానా ? లేదు .... అబ్బే....లేదు గురూ ! ఏడవండే ?" సన్నగా గొణుక్కుని మళ్ళీ మొదలెట్టాడు.

"మా సాయిత్రిని సేసుకుని ఈ యింటోనే మా దగ్గిరే ఉండిపో అల్లుడా" అనేవోడు మావ.

సాయిత్రిమీద పేమతో అల్లేది చెప్తే దానికల్లా ఒప్పేసుకున్నాను. అలాటిది ఇదిగో ఇలా సూడు.... ఈ కాలు....ఓనాడు సాయిత్రి సెట్టెక్కి ఏవో పూలుకోసి ఎట్టమనడిగింది. దానికోసం సెట్టెక్కాను. నన్నేదో దడిపిద్దావను కుందంట.

"బావోయ్" అంటూ ఓ కేక పెట్టింది.

కొమ్మ సివరగా కూసుని పైకి సూస్తూ పూలందుకుంటా ఉన్న, నే ఉలిక్కిపడి ఎనక్కి తిరిగి కిందకిసూశాను సాయిత్రికేవై పోయిందోనని.

అంతే....ఆ సూట్టంలో కాలు మడతపడి కొమ్మమీంచి జారి, ఆ యెత్తునించి నేల కరుసుకున్నాను. దాని ఫలితం ఈ ఎడం కాలుతో క్రాస్తంత కుంటుతున్నట్టుగా నడవాలి.

ఆ దినంనించీ సాయిత్రి నాకు దూరంగా ఉండటం మొదలెట్టింది. మాటలు తగ్గించింది. మావకూడా ముందటిలా కబుర్లాట్టం మానేసుకున్నాడు.

అర్థం సేసుకునేపాటి ఇంగితం నా కుంటే మా అమ్మ అట్టా ఎందుకనాల్సొచ్చేది "నీకు లోకం తెలీదురా" అని. అదీగాక ఆ కుంటి కాలోడిని నే సేసుకోనని గారాబుకూతురు సాయిత్రి అల్లయ్య దగ్గిర గునిసేదని నాకే మెరుక ?

ఓనా డున్నట్టుండి సక్కగా సింగారించుకుని, నా దగ్గిరగొచ్చి కూసుని కబుర్లాట్టం మొదలెట్టింది సాయిత్రి.

అయిసైపోయాన్నేను. మాట్టాట్టం మానిన మావ కూతురు మల్లీ మనసై, నా కాడికి వొచ్చిం దనుకున్నా. ఇద్దరం కబుర్లాడుకుంటుంటే సేతిలో తెల్ల కాయితంతో వొచ్చాడు మావ.

"అడ్డొచ్చి నట్టున్నానే....వోన్లే యిప్పుడే అన్నీ సెపుతూ యిసిగించన్లే నిన్ను....ఇప్పటికి దీనిమీదో సంతకం పారెయ్. యివరాలు ఆనక సెప్తాను." అన్నాడు వొస్తూనే తెల్ల కాయితంమీద సంతకం కావాలని సూపిస్తూ.

నాయంక మత్తుగాచూసి నవ్వింది సాయిత్రి.

"ఆ సంతక వేదో గమ్మునెట్టు బావా. నీతో ఓ మంచి కబురు సెప్పాలి" అన్నాది.

నే సంతకం సెయ్యటం, మావ అది తీసుకుపోవటం సాయిత్రి కల్లల్లోకి సూస్తున్న నాకు దెలిస్తే గదా! ఆ మరుసటిరోజు మావన్నాడు. "ఒరే రంగా! సాయిత్రి కో మంచి సమ్మందం వొచ్చిందిరా. ఈ నెల్లో దాని పెళ్ళి చేసేద్దావని సూ స్తున్నాను.

తెల్లబోయాన్నేను. "మావా....నువ్వనేది"....మరి మాటాడలేక పోయాను.

మల్లీ అదేమాటన్నాడు మావ.

"అన్నాయంసేయకు మావా" అన్నాను

"సాయిత్రి లేందే బతకలేను మావా" అని సెప్పాను.

బతిమాలాను. మంచిగా సెప్పాను.

ఉహూ! ఎంత సెప్పినా ఏం లాభం?

సివరి కన్నాడు, సాయిత్రి కుంటికాలు మూలంగా నన్ను సేసుకోనన్నాదని.

ఏడవలేక నవ్వుకున్నాన్నేను. ఎవరికోసం నేను కుంటివాడి నయ్యాను. నేను పేమించిన సాయిత్రికోసం కాదూ? సాయిత్రికి నా మీద జాలి కూడా లేదని తెల్సిపోయింది.

"సరే మావా, ఇంక ఈ ఇంటో నే మసల్లేను. నే నెైటైనా పోతా" నన్నాను.

"ఒరే! ఎల్లేముందు ఇదో సారి సూసిపో" అంటూ సూపించాడు మావ ఓ కాయితం.

ఔనదే .... కిందటి రోజు నే సేసిన సంతకం కిందగా ఉంది. పైన ఏం రాసుందో తెల్సా గురూ! నా కప్పుడప్పుడు మతి స్తిమితం తప్పుతూ ఉంటుందట. నాకు గ్యాపకం తక్కువట. అందుకని నా ఆస్తి కంతకీ హక్కుదారుడుగా నా మావని పెట్టుకున్నానని నే రాసినట్టు. కింద నా సంతకం ఉందిగా....

కోర్టు కెక్కితే నేనే గెల్సి నిజానిజాలు బైట పడేవేమో? నా కేవిటో ఒల్లూ పై తెలియలా!

అటు సాయిత్రీ లేదు .... ఇటు ఆస్తంతా కాజెయ్యాలని సూస్త న్నాడు మావ.

అంతే ఆగలేకపోయాను. ఉద్రేకం సంపుకోలేక పోయాను. పెపంచంలో ఉన్న పిచ్చోళ్ళల్లో నేనూ ఓ పిచ్చోడి నయ్యాను. కోపంలో సితకబాదాను మావని. సావలేదు గానీ సచ్చినంత పనైంది మావకి నా దెబ్బల్తో.

మావని, నే సంపడానికి పెయత్నించినట్టూ, కొద్దిలో మావకి సావు తప్పినట్టూ నా మీద కేసు బనాయించారు అయ్యా కూతుళ్ళు. నాకు సాచ్చెం ఎవరూ లేరు. పలితం ఇదుగో ఈ కటకటాలు...."

రెండు చేతుల్లోనూ మొహం దాచుకున్నాడు రంగడు, ఆప్యాయంగా రంగడి భుజమ్మీద చెయ్యేశాడు నారాయణ.

"యిడుదలయ్యాక ఇంకాళ్ళ చాయలకి పోదల్చలేదు. నాకా ఆస్తీ వొద్దు .... ఆ మనుసులూ వొద్దు .... పేమ కావాలికానీ పైన లెంతకాలమ్ ఉంటయ్" చెప్పడం ముగించి కళ్లు తుడుచుకుంటూ "మరి గురూ! కాస్త నీ గురించి కూడా యినిపించు యింటాను. మల్లీ రేపెల్లి పోతావ్" అన్నాడు రంగడు.

"నా గురించి చెప్పుకోడానికి గొప్ప సంగతులేవీ లేవు. కానీ ఇది మాత్రం నిజం .... నేను ఏ నేరం చెయ్యకుండానే ఈ కటకటాల్లో కొచ్చాను అయినా నువ్వడుగుతున్నావు కాబట్టి ఉన్నదేదో చెప్తాను." అంటూ మొదలెట్టాడు నారాయణ.

"నాకు చిన్నప్పటినించీ కూడా కటకటాల ఇళ్ళంటే చాలా ఇష్టం. వీధివైపు వరండా, కటకటాలూ ఉన్న ఇళ్ళంటే మనసు నాకు. అటువంటి ఇళ్ళల్లో కటకటాల లోపల కూర్చుని వీధిలో వచ్చే పోయే వాళ్ళని చూడటం సరదా!

మా నాన్న తోటి అస్తమానం అంటూ వుండేవాడిని. "ఈ ఇల్లు బావులేదు నాన్నా! మంచి కటకటాల ఇల్లు కొనమని."

"నువ్వు పెద్దవాడివై, పెద్ద ఉద్యోగం చేసి మంచి కటకటాల ఇల్లు కట్టిద్దువు గానిలే" అనేవాడు నాన్న చిన్నగా నవ్వుతూ.

ఓ సారి నాన్నతో ఏదో ఊరెళ్ళాను. బాగా చిన్న తనం. అక్కడ నాన్న స్నేహితుడి ఇంటికి దగ్గిర్లోనే జైలుంది. అప్పట్లో అది జైలని నాకు తెలియదులే! ఆ జైలు చూద్దామని నన్ను కూడా తీసుకుని ఆ స్నేహితుడితో బయల్దేరాడు నాన్న.

"నాన్నా! ఈ ఇళ్ళు బావున్నాయి. మనం కూడా ఇందులో ఉందామా" అన్నాను నేను లోపలికెళ్ళాక ఆ కటకటాల గదులు చూస్తూ.

నా వీపుమీద చిన్నగా చరిచి విరగబడి నవ్వాడు నాన్న స్నేహితుడు.

ఆయననెందుకు నవ్వాడో నా కర్థం కాలేదు. వాళ్ళూ చెప్పలేదు. నాకు పెళ్ళీడు వచ్చాక నాన్న తెచ్చిన సంబంధాల్లో ఒకటైన సుభద్రని పెళ్ళి చేసుకున్నాను. సుభద్రని చేసుకోడానికి ఒక ముఖ్యమైన కారణం ఉంది. అదిచెప్తే విన్నవాళ్ళు నవ్వుతారు కూడా! సుభద్ర నాన్నగారిది కటకటాల ఇల్లు. ఆ ఇల్లుచూసే నేను, సుభద్రని చేసుకోడానికి ఆలోచించవలసింది లేదని చెప్పేశాను. అత్తగారింటికి వెళ్ళినప్పుడైనా కటకటాల్లో కూర్చుని వీధిలో వచ్చే పోయేవాళ్ళని చూసే సరదా తీర్చుకోవచ్చునని ఏ ఒక్కరితోను చెప్పలేదు. పెళ్ళయిన తర్వాత అత్తారింటికి వెళ్ళినప్పుడల్లా నా ముచ్చట తీర్చుకుంటూ ఉండేవాడిని.

"ఇదేదో మీ బలహీనతండీ బాబూ" నవ్వుతూ అంటూ ఉండేది సుభద్ర నా పిచ్చి చూసి.

"ఏమో సుభద్రా! చిన్నప్పుడైతే ఏదో సరదా అనుకోవచ్చు! పెద్దయ్యాక కూడా నాకీ పిచ్చి ఏమిటి చెప్పు? ఇది నాలో బలహీనత కాక ఏమిటి" అనుకునేవాడిని నేను మనసులో.

నాకు ఒక కొడుకు, ముగ్గురు కూతుళ్ళు. ముగ్గురు కూతుళ్ళకీ పెళ్ళిచేసి అత్తారిళ్ళకి పంపించేశాను. ఏదో తిండి గడిచే జీతం నాది. నాకు మల్లే చిన్న ఉద్యోగస్తుడు కాకుండా పెద్ద ఉద్యోగం వెలగబెట్టాలని, పెద్ద చదువులు చెప్పిద్దామని ఎంతో ఆశ పెట్టుకున్నాను నా కొడుకు మీద. కానీ ఏం లాభం? వాడికి చదువంటలేదు. బిజినెస్ బిజినెస్ అంటూ ఎగబడ్డాడు. ఏదో పర్వాలేదు .... లాభాలే తీస్తున్నాడు. సుఖంగా సాగుతున్న సంసారంలో చిచ్చుకాకపోతే నాకీ అపనింద ఏమిటి? మా ఆఫీసులో సొమ్ము పోయింది. ఆ నేరం నా మీద కొచ్చింది. చెయ్యని నేరంనించి తప్పుకుందుకు నాకు సాక్ష్యం, దైవ సహాయం లేకపోయాయి. మంచివాళ్ళకే శత్రువులెక్కువ. నా పని అంతే అయింది. చెయ్యని నేరం నెత్తిన మోపి, ముచ్చట తీర్చుకోమని కటకటాల్లో కూర్చోపెట్టాడు భగ

వంతుడు. చిన్న తనం నించీ కటకటాలంటే ఉన్న మక్కువ తీరి పోయింది రంగా!" నవ్వుతూ చెప్పటం ముగించాడు నారాయణ.

దీర్ఘంగా నిట్టూర్చి జాలిగా చూశాడు రంగడు.

* * *

జైల్లోంచి బయట అడుగుపెట్టిన నారాయణ ఒక్క నిముషం భయంతోనూ, బాధతోనూ అంతకంటే ఎక్కువ సిగ్గుతోనూ ఒక ప్రక్కగా నిలబడిపోయాడు. జైల్లో గడిపిన తను ఇకనించీ ఊళ్లో తలెత్తుకు తిరిగేదెలా? ఈ ప్రశ్నకి తృప్తి కలిగించే జవాబు దొరకలేదు. ఏది ఏమైనా తప్పదు .... తన భార్యకోసం, కొడుకుకోసం తన ఊరు వెళ్ళాలి. చివరికా నిశ్చయంతోనే రైలెక్కాడు.

తన ఊరు చేరి ఎవరివైపూ తలెత్తి చూడకుండానే గబగబా ఇంటి వైపు నడిచాడు. అరుగుమీద కూర్చున్న ఆసామీని చూసి అర్థంకాక అలాగే నిలబడ్డాడు.

"ఎవరు కావాలండీ?" అడిగాడా పెద్దమనిషి.

తన భార్య పేరూ, కొడుకు పేరూ చెప్పి "ఈ ఇంట్లో ఉండాలే" అన్నాడు గొణిగినట్టుగా.

"వాళ్ళా! అదిగో, ఆ సందులో రెండో ఇల్లే, వేప చెట్టు పక్క రెండో ఇల్లే వాళ్ళది" అన్నాడాయన ప్రక్కసందులోకి చూపిస్తూ.

సుభద్ర రూపం కళ్ళముందు కదుల్తుంటే, అడుగులు తడబడుతుంటే ఆత్రంగా ఆ సందులోకి, ఆ ఇంటి ముందుకు చేరాడు నారాయణ.

"ఇదేమిటి? .... ఇది.... ఇది కటకటాల ఇల్లు...." అప్రయత్నంగా నారాయణ కాళ్ళు ఆ ఇంటిముందు ఆగిపోయాయి.

అప్పుడే లోపల్నుంచి బయటికి వస్తున్న సత్యం, వీధిలో నిలబడిన తండ్రిని చూసి పరుగులాంటి నడకతో వచ్చాడు.

"అమ్మా! నాన్న వచ్చాడు" సత్యం కేకతో బయటికి వచ్చిన సుభద్ర ఆనందంలో మాటలు కరువై మూగగా గుమ్మంలో నిలబడి పోయింది. ఆప్యాయంగా భార్యవంక చూసి చిరునవ్వు నవ్వాడు నారాయణ. బదులుగా సుభద్ర కళ్ళు వెలుగు నింపుకుని వెదజల్లాయి నవ్వులు.

"నువ్వు విడుదలయ్యే రోజు, నేను, ఆ ఊరొద్దా మనుకున్నాను నాన్నా. అనుకున్న దానికంటే ముందే విడుదల చేసినట్టున్నారు. ఔనా! తండ్రిమీదున్న భక్తి, విశ్వాసం మరెవరిమీదా లేవు సత్యానికి.

"ముందు కాఫీ ఇచ్చి, స్నానానికి నీళ్ళు పెడతాను" అంటూ లోపలికి వెళ్ళింది సుభద్ర.

"కూర్చో నాన్నా" అక్కడే ఉన్న పడకుర్చీ చూపించాడు సత్యం.

"నీకు కటకటాల ఇల్లంటే ఇష్టం కదు నాన్నా! నాకు వ్యాపారంలో లాభాలు బాగానే వస్తున్నాయి. ఈ ఇల్లు అమ్మకానికి వొచ్చింది. అంత డబ్బొ ఒక్కసారే ఇవ్వక్కర్లేదన్నాడు ఇంటాయన. మంచివాడు. ఆలస్యం చేసినకొద్దీ ఇంటిరేటు పెరిగిపోవచ్చు. అందుకని మొన్ననే కొనేశాను. నిన్న మంచి రోజని మకాం ఈ ఇంట్లోకి మార్చేశాం." తృప్తిగా తండ్రి కళ్ళల్లోకి చూశాడు సత్యం.

తన మనసు ఇప్పుడెవరికీ అర్థం కాదనుకున్నాడు నారాయణ. "ఒక విధంగా నా మంచికే నువ్వీ ఇల్లు కొన్నావేమోరా సత్యం. జైల్లో ఉండి వచ్చిన నేను, దొంగనని అనవసరంగా పేరు తెచ్చుకున్న నేను ఊళ్లో తలెత్తుకు తిరిగేదెలా? నలుగుర్లోనూ నడిచేదెలా? అని మథన పడుతున్న నాకు మార్గం చూపించావు. ఇన్నాళ్లూ ఆ కటకటాల్లో గడిపి

వచ్చాను. ఇప్పుడింక సిగ్గుపడుతూ, బాధపడుతూ ఊళ్లో తిరగక్కర్లేకుండా, వీధిలో వచ్చేపోయే వాళ్ళని చూస్తూ ఈ కటకటాల్లో కూర్చుని జీవితాంతం గడుపుతాను. ఆ కటకటాల్లో బందీని కొన్నాళ్ళు మాత్రమే. దానికి ఫలితం, నలుగుర్లోనూ మొహం చూపలేక జీవితాంతం బందీని ఈ కటకటాల్లో....” అన్నం కంటే ముఖ్యం అభిమానం అనుకునే నారాయణ మనసులో అనుకున్నాడా మాటలు.

పడక్కుర్చీలో వెనక్కివాలి కళ్ళు మూసుకున్నాడు.

కళ్ళు మూసుకున్నా కనిపించి నవ్వుతోంది కటకటాలు.

★